6న సిఎం పోలవరం పర్యటన

ఏలూరు : ఈ నెల 6వ తేదీన జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బంది ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై శనివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 6వ తేదీ ఉదయం 10.15 గంటలకు పోలవరం ప్రాజెక్ట్ సైట్‌కు హెలికాప్టర్‌లో విచ్చేస్తారని, అనంతరం ప్రాజెక్ట్‌లోని లోయర్ కాఫర్ డాం, అప్పర్ కాఫర్ డాం, స్పిల్ వే, ఎర్త్ కం రాక్ ఫిల్‌డాం, తదితర నిర్మాణ ప్రాంతాలను సందర్శించి పనుల పురోగతిని పరిశీలిస్తారన్నారు. అనంతరం ప్రాజెక్ట్ సైట్‌లోని సమావేశపు హాలులో ఇరిగేషన్ శాఖ ఇంజినీర్లు, అధికారులు, వివిధ శాఖల అధికారులతో ప్రాజెక్ట్ నిర్మాణ పనుల పురోగతి, ప్రాజెక్ట్ నిర్వాసితులకు సహాయ పునరావాస కార్యక్రమాల అమలుపై సమీక్షిస్తారన్నారు. అనంతరం హెలికాప్టర్‌లో తాడేపల్లి బయలుదేరి వెళ్తారన్నారు.

'లో ఓల్టేజీ'తో ఉక్కిరిబిక్కిరి..!

కరెంటు కష్టాలతో జనం నరకయాతన

ఫ్యాన్లు తిరగవు.. లైట్లు వెలగవు

వడగాల్పులకు రాత్రిళ్లు సైతం ఉక్కపోతతో ఇబ్బందులు

నిడమర్రు మండలం అడవికొలనులో దారుణ పరిస్థితి

కరెంట్ ఉన్నా ఇన్వెర్టర్లు వాడాల్సిన పరిస్థితి

సమస్యల్లేంటూ విద్యుత్‌శాఖ అధికారుల ప్రకటనలపై విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కరెంటు కోతలు ఒకపక్క.. లో ఓల్టేజీ సమస్య మరోపక్క.. ఫలితంగా జిల్లా ప్రజానీకం నరకయాతన అనుభవిస్తుంది. విద్యుత్ కోతలు, సమస్యలు లేవని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్న మాటలు, ప్రకటనలు చూసి జనం నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఇబ్బందులను పట్టించుకోకుండా విద్యుత్‌శాఖ అధికారులు మాట్లాడుతున్న తీరు అందరిలోనూ ఆగ్రహం తెప్పిస్తోంది. జిల్లాలో అనేక గ్రామాల్లో కరెంటు కోతలతో పాటు లో ఓల్టేజీ సమస్య జనాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ సమస్యతో నిడమర్రు మండలం అడవికొలను గ్రామానికి చెందిన ప్రజలు పడుతున్న ఇబ్బందులే నిదర్శనంగా చెప్పొచ్చు. కరెంటు ఉన్నప్పటికీ ఆపేసి ఇన్వర్టర్‌పై ఫ్యాన్లు తిప్పాల్సి దుస్థితి అ గ్రామంలో ఉంది. గ్రామంలో స్టేజీ వద్ద నుంచి పంచాయతీకి వెళ్లే రోడ్డులో ఉన్న ప్రజలు మాట్లాడుతూ రాత్రీ, పగలు నిద్రలేకుండా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పది లక్షలకుపైగా గృహవిద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో పేద, మధ్యతరగతి విద్యుత్ కనెక్షన్లు అత్యధికం. వేసవి ప్రారంభమైన తర్వాత సామాన్య ప్రజానీకం అనుభవిస్తున్న విద్యుత్ కష్టాలు అన్నీఇన్నీ కావు. కొద్దిరోజులుగా నిత్యం జిల్లాలో 43 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. వడగాల్పుతో జనం అల్లాడిపోతున్నారు. ఎండవేడికి బయటకు రావాలంటే వణికిపోతున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచే వేడిగాలులు వీస్తున్నాయి. రెండు రోజులుగా వడగాల్పులు మరింత తీవ్రమయ్యాయి. కరెంటు సమస్యలతో ఇంట్లో కూడా ఉండలేని పరిస్థితి నెలకొనడంతో జనాలకు ఏంచేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా గ్రామీణ ప్రజానీకం పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. లోడ్‌రిలీఫ్ పేరుతో ప్రతీరోజు విధించే విద్యుత్ కోతలకు తోడు లో ఓల్టేజీ సమస్య జనాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. కరెంటు ఉన్నా లేనట్టుగానే పరిస్థితి తయారైంది. లో ఓల్టేజీతో ఫ్యాన్లు చాలా నెమ్మదిగా తిరుగుతుండటంతో గాలిరాని పరిస్థితి నెలకొంది. పగలూ, రాత్రి సైతం ఇదే పరిస్థితి నెలకొంది. అడవికొలనులో పరిస్థితి మరింత తీవ్రతరంగా ఉండటంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద, చిన్న తారతమ్యం లేకుండా నిద్రలేక అవస్థలు పడుతున్నారు.

రాత్రిళ్లు సైతం వేడిగా ఉండటం, ఫ్యాన్లు తిరగకపోవడంతో ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ట్రాన్స్‌ఫార్మర్లు నిర్మిస్తున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ ధనికులు ఉన్న కొన్ని ప్రాంతాలకే అవి పరిమితమవుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లో ఓల్టేజీ సమస్యతో ఎసిలు సైతం పనిచేయడం లేదు.

ముఖ్యంగా డెల్టా మండలాల్లో ఆక్వాకు కరెంటు సరఫరా ఇబ్బందులు లేకుండా చేస్తున్న కారణంగా గ్రామాల్లో లో ఓల్టేజీ సమస్య వస్తుందన్న చర్చ సైతం సాగుతోంది. విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని జనం కోరుతున్నారు. నిడమర్రు మండలం అడవికొలనులో ఓల్టేజ్ సమస్యపై ఎఇ మురళీకృష్ణను వివరణకోరగా గ్రామంలో రెండుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు నిర్మించామని, ఎక్కడా సమస్య లేదని చెప్పారు.

లో ఓల్టేజీతో రాత్రులు నిద్ర ఉండటం లేదు

మానికల శివయ్య, అడవికొలను

స్టేజి నుంచి పంచాయతీకి వెళ్లే రోడ్డులో మా ఇల్లు. కరెంటు కోతలకంటే లో ఓల్టేజ్ సమస్య మమ్మల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. కరెంటు ఉన్నా ఫ్యాన్లు తిరగడం లేదు. ఎండవేడికి ఫ్యాన్లు తిరగకపోవడంతో ఉక్కబోతతో అల్లాడిపోతున్నాం. రాత్రులు నిద్రలేకుండా గడపాల్సి వస్తోంది. దీంతో నీరసం వచ్చి ఉదయం పనికి వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం.

ఫ్యాన్లు తిరగక ఉక్కపోతను తట్టుకోలేకపోతున్నాం

పాలా సత్యనారాయణ, అడవికొలను

కరెంటు లో ఓల్టేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఫ్యాన్లు తిరగడం లేదు. లైట్లు కూడా సరిగా వెలగడం లేదు. ఫ్యాన్లు తిరగకపోవడంతో ఉక్కపోత ఇబ్బంది పెడుతుంది. కరెంటు ఉన్నా ప్రయోజనం లేదు. ఈ సమస్యను ట్రాన్స్‌కో అధికారులు వెంటనే పరిష్కరించాలి.

ఒడిశా రైలు ప్రమాదంలో

జిల్లావాసులు సురక్షితం

ఒకరు స్వస్థలానికి - మరొకరికి భువనేశ్వర్ ఆసుపత్రిలో చికిత్స



సురక్షితంగా ఏలూరు చేరుకున్న శ్రీకర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో చిక్కుకున్న జిల్లా కేంద్రం ఏలూరుకు చెందిన వ్యక్తి సురక్షితంగా బయటపడ్డాడు. ఆయన ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో భువనేశ్వర్ నుండి ఏలూరుకు సురక్షితంగా శనివారం రాత్రి చేరుకున్నాడు. సంబంధిత వివరాలిలా ఉన్నాయి. ఏలూరు పట్టణంలోని లక్ష్మీనగర్ ప్రాంతానికి చెందిన పిల్లి శ్రీకర్‌బాబు కలకత్తాలో ఇండియన్ స్టాటికల్ ఇన్‌స్టిట్యూట్‌లో బ్యాచిలర్ ఆఫ్ స్టాటస్టిక్స్ డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. అతనికి సెమిస్టర్ సెలవులు ఇవ్వడంతో అతను కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లోను ఏలూరు వచ్చేందుకు శుక్రవారం మధ్యాహ్నం షాలిమార్‌లో ఎక్కాడు. అతనితోపాటు రాజమండ్రికి చెందిన అతని సీనియర్లు కూడా అదే రైలులో ఉన్నారు. అలాగే ఏలూరు ప్రాంతానికి చెందిన గోరక్ చందు పాల్ కూడా ఇదే రైలులో బి-1 బోగిలో ప్రయాణిస్తున్నాడు. శ్రీకర్ మాత్రం బి8 భోగిలో ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం 6.55 గంటలకు రైలు ప్రమాదానికి గురైంది. ఎట్టకేలకు ఈ ప్రమాద నుండి సురక్షితంగా బయటపడిన శ్రీకర్ శనివారం రాత్రి ఏలూరు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. అతని బంధువులు అతన్ని ఏలూరు రైల్వే స్టేషన్ నుండి ఇంటికి తీసుకువెళ్లారు. గోరక్ చందు పాల్‌కు గాయాలు కావడంతో అతను భువనేశ్వర్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు బంధువులు తెలిపారు.

అది ఎంతో భయానకమైన ఘటన : శ్రీకర్

రైలు ప్రమాదం నుండి బయటపడిన శ్రీకర్ ఈ ఘటనతో తీవ్ర భయభ్రాంతులకు గురైనట్లు చెప్పాడు. తాను శుక్రవారం మధ్యాహ్నం కోరమండల్ ఎక్స్‌ప్రెస్ షాలిమార్‌లో తన సీనియర్లతో కలిసి ఎక్కినట్లు తెలిపాడు. రైలు బాలాసోర్ నుండి దాదాపు 40 కిలోమీటర్లు దూరం ప్రయాణించిందని, అప్పటికే రైలు అతివేగంగా వెళ్తుందని, ఒక్కసారిగా రైలు కుడి వైపునకు, ఆ తర్వాత ఎడమవైపుకు ఒరిగిపోయిందని, వెంటనే ప్రాణభయంతో ప్రయాణికులంతా రైలు నుండి బయటకు వచ్చి చూసేటప్పటికి అంత చీకటిగా ఉందని, ఒక మూడు భోగీలు మాత్రం ఒకదానిపై ఒకటి ఎక్కి ఉన్నాయని వివరించాడు. 'చాలా భయం వేసింది. ఒక్కసారిగా వచ్చిన పెద్ద శబ్దానికి అందరూ భయంతో పరుగులు తీశారు. కొద్దిసేపటికి తాము మా బ్యాగులను తీసుకొని బయటికి వచ్చేశాం. అక్కడ ఏం జరుగుతుందో కూడా తెలియని పరిస్థితిలో మేము ఉన్నాము. రైలు ప్రమాదంలో ఎన్ని రైళ్లు ఢీకొని ఈ ప్రమాదం జరిగింది అన్న విషయం కూడా మాకు సరిగ్గా తెలియలేదు' కొద్దిసేపటికి రైల్వే అధికారులు, అంబులెన్సులు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను భువనేశ్వర్ ఆసుపత్రికి తరలించారు. అయితే నేను మాత్రం ఒంటరిగా ఒక కిలోమీటర్ నడుచుకుని వస్తే ఒక జంక్షన్ వచ్చింది. అక్కడ నుండి బస్సులో నేను భువనేశ్వర్ చేరుకున్నాను. అక్కడ నుంచి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో ఏలూరు చేరుకున్నాను.' అని వివరించాడు.

మరోసారి గోదావరి వరదలు ముంచెత్తకుండా

ముందస్తు రక్షణ చర్యలు చేపట్టండి : సిపిఎం

మాట్లాడుతున్న మంతెన సీతారాం

ప్రజాశక్తి - ఏలూరు

త్వరలో వర్షాకాలం రానున్న నేపథ్యంలో మరోసారి గోదావరి వరదలు ముంచెత్తే ప్రమాదం ఉన్నందున సహాయ కార్యక్రమాల కోసం ముందస్తుచర్యలు తీసుకుని యంత్రాంగాన్ని సమాయత్తం చేయాలని, పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయి పునరావాస చర్యలు చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీ సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన సీతారాం, వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత సంవత్సరం(2022) జూలైలో గోదావరికి వచ్చిన వరదల నుండి ప్రజలు ఇంతవరకూ కోలుకోలేదని, ముఖ్యంగా పోలవరం మునక ప్రాంతాల్లోని ఎనిమిది మండలాల ప్రజలు ఎలాంటి అభివృద్ధికి, సంక్షేమానికి నోచుకోక అడవుల్లో చెట్లు, పుట్టలపాలై బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం డ్యాం పూర్తికాకముందే గత జూలైలో వరదలతో వందలాది గ్రామాలు మునిగిపోయాయని తెలిపారు. ఈ వరదల్లో మునిగిపోయిన గ్రామాల ప్రాతిపదికపై పోలవరం నిర్వాసితుల పునరావాసానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినా నేటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెడచెవిన పెడుతూనే వస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఏజెన్సీ గిరిజన ప్రజలకు ఎలాంటి సహాయమూ అందించకుండా నిర్లక్ష్యం చేసిందని, పునరావాసానికి నిధులు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే పేరుతో మరో 32 గ్రామాలను కొత్తగా చేర్చిందన్నారు. 41.15 మీటర్ల వద్ద మునుగుతాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రామాలకు వాస్తవంగా గత వరదల్లో మునిగిన గ్రామాలకు పొంతనే లేదని తెలిపారు. పునరావాస కాలనీలు సైతం ఈ వరదల్లో మునిగిపోయాయని పేర్కొన్నారు. శాస్త్రీయ ప్రాతిపదికపై రీసర్వే చేసి దాని ఆధారంగా అన్ని గ్రామాలకు పూర్తిస్థాయి పునరావాస చర్యలు చేపట్టాలని సీతారాం డిమాండ్ చేసారు. ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి రావడంతోనే నష్టపరిహారాన్ని రూ.6.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతామని వాగ్దానం చేసి నేటికీ అమలు చేయలేదన్నారు. ఈ నాలుగేళ్లలో భూముల విలువలు పెరిగాయని దాని ప్రకారం ఎకరాకు రూ.20 లక్షల వరకూ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2023 సెప్టెంబర్ వరకూ 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ పునరావాస ప్యాకేజిని అందించాలని, పూర్తిస్థాయి పునరావాసం అమలయ్యే వరకూ మునకప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపైనా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపైనా సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జూన్ 20వ తేదీ నుండి మహాపాదయాత్ర రంపచోడవరం నుండి విజయవాడ వరకూ నిర్వహించాలని నిర్ణయించిందని తెలిపారు. ఈ పాదయాత్ర జయప్రదానికి జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు అందరూ కదలి జయప్రదం చేయాలని కోరారు. ఈ పాదయాత్రకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు.

సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ఎండలు విపరీతంగా పెరిపోతున్నాయని, ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో చెరువులు, గుంతలు అక్రమంగా తవ్వి మట్టి, ఇసుక రవాణా చేస్తున్నారని, దీన్ని అరికట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, పి.కిషోర్, ఎం.నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, తామా ముత్యాలమ్మ, గుడెల్లి వెంకట్రావు, వై.నాగేంద్రరావు, ఎ.శ్యామలారాణి, ఎ.ఫ్రాన్సిస్, తుమ్మల సత్యనారాయణ, తెల్లం దుర్గారావు మాట్లాడారు.

నిరసన తెలుపుతున్న డివైఎఫ్ఐ నాయకులు

మహిళా రెజ్లర్ల అక్రమ అరెస్టులను ఖండించాలి

డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో నిరసన తెలుపుతున్న రెజ్లర్ల క్రీడాకారుల అక్రమ అరెస్టును ఖండించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయం దగ్గర జగ్జీవన్ విగ్రహం వద్ద శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ కార్యదర్శి ఎస్‌కె మాబు సుభాని అధ్యక్షత వహించగా జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ దేశ రాజధాని నడిబొడ్డులో 37 రోజుల నుంచి ఆందోళన చేస్తున్నా, ప్రపంచ వేదికపై భారత కీర్తిని పెంచే రెజ్లర్ల క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నిరసన తెలియజేస్తున్నప్పటికీ నరేంద్ర మోడీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని తెలిపారు. బిజెపి ఎంపీపై కేసు నమోదు చేయమని కంప్లైంట్ ఇస్తే వారం రోజులైనా ఎఫ్ఐఆర్ చేయడానికి నిరాకరించిన పోలీసుల తీరును ఖండించారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్న రెజ్లర్లపై కేసు నమోదు చేయడంలో పోలీసుల తీరు బాధాకరమన్నారు. భారతదేశ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించబడే పార్లమెంటు ప్రారంభోత్సవం సందర్భంగా రెజ్లర్లకు న్యాయం చేయాలని కోరుతూ శాంతియుత నిరసన ర్యాలీ చేస్తామంటే వేధింపులకు పాల్పడిన వారిని వదిలేసి లైంగిక వేధింపులకు గురైన వారిని అక్రమంగా అరెస్టు చేశారన్నారు. ఈ దుర్మార్గపు సంఘటనను ప్రజాస్వామ్య వాదులందరూ ముక్త కంఠంతో ఖండించాలని కోరారు. భారతదేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా విస్తరింపచేసిన మహిళా క్రీడాకారులకు న్యాయం చేయలేని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇంకెవరికి న్యాయం చేస్తారని ప్రశ్నించారు. తక్షణమే మహిళా రెజ్లర్లపై అత్యాచారానికి పాల్పడ్డా బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌పై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజా సంఘాలన్నీ కలిసి క్రీడాకారులకు మద్దతుగా దేశవ్యాప్తంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు రాజేష్, ఉదయ్, పి.వెంకట సుబ్బారావు, ఎం.పవన్, పి.మంగరాజు పాల్గొన్నారు.



ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న పిల్లి రామకృష్ణ

'ఉపాధి' పనుల్లో నిబంధనలు తొలగించాలి

ప్రజాశక్తి - ఏలూరు రూరల్

ఉపాధి హామీ కూలీలకు ఇబ్బంది కలిగిస్తున్న ఫొటో యాప్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, పని ప్రదేశాల్లో మట్టి అక్రమ రవాణాను అరికట్టాలని, ఉపాధిలో యంత్రాలను నిషేధించాలి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరు మండలం మాదేపల్లి పంచాయతీ లింగరావుగూడెంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీల పనిప్రదేశాల్లో శనివారం పర్యటించారు. కూలీలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి బడ్జెట్‌లో కోత విధించిందన్నారు. కూలీలు పనిచేసే చోట సౌకర్యాలు కల్పించకుండా గతంలో ఉన్న బెనిఫిట్స్ అన్ని ఎత్తివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన నేషనల్ మొబైల్ మోనటరింగ్ ఫొటో సిస్టం ద్వారా కూలీలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. చాలా చోట్ల సిగ్నల్స్ సమస్య వల్ల ఫొటో అప్‌లోడ్ కాకుంటే ఆ రోజు కూలి నష్టపోయే అవకాశం ఉందన్నారు. అలాగే సమ్మర్ అలవెన్స్, రవాణా ఛార్జీలు, టెంట్ సౌకర్యం, మెడికల్ కిట్లు వంటి సౌకర్యాలు ఎత్తివేయడంతో కూలీలకు నష్టం కలుగుతుందని మండిపడ్డారు. ఉపాధి పనిని పాత పద్ధతిలోనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచుకుంటూ పోతూ కూలీల వేతనాలు మాత్రం తగ్గించుకుంటూ సామాన్యుల కడుపు కొడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు ప్రమోద్, కృష్ణ పాల్గొన్నారు.

దెందులూరు తహశీల్దార్‌పై చర్యలు కోరుతూ వినతి

ప్రజాశక్తి - ఏలూరు

పేద ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న దెందులూరు తహశీల్దారుపై తక్షణం చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా రెవెన్యూ శాఖ అధికారి (ఆర్‌డిఒ) పి.కిషోర్‌బాబు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దోసపాడులో 144, 145 సెక్షన్లు పెట్టి పేదలను, దళితులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. జెసి కోర్టులో ఉన్న 72 ఎకరాలు మినహాయించి మిగిలి ఉన్న అసైన్డ్, సీలింగ్ 150 ఎకరాల భూమిని వెంటనే పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పట్టాదారుల పేర్లు, వారి వారసుల పేర్లు ఇచ్చినప్పటికీ ఇవ్వలేదని చెప్పి, మళ్లీ ఇవ్వాలని దెందులూరు తహశీల్దార్ మాట మార్చడం సిగ్గుచేటన్నారు. తహశీల్దార్, ఎస్ఐ, సిఐలు చట్టాలను అమలు చేయకుండా భూస్వాముల పక్షాన కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. అసైన్డ్ యాక్ట్ ప్రకారం వ్యవసాయ భూముల్లో చెపలు, రొయ్యల చెరువులు తవ్వకూడదని ఉన్న, అసైన్డ్ సెక్షన్ 24 ప్రకారం చట్టవిరుద్ధంగా వ్యవహరించిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దోసపాడులో మాటిమాటికి ఎందుకు 144, 145 సెక్షన్లు విధించి పేదలను, దళితులను భయభ్రాంతులకు గురిచేసి బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెక్షన్ 145 ప్రకారం భూముల్లో ఉన్న పంటను స్వాధీనం చేసుకోలేదంటే భూస్వాముల పక్షాన ఉన్నట్టే అర్థమవుతుందన్నారు. సెక్షన్ 20ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ సెక్షన్ ప్రకారం ఎలాంటి అనుమతులూ లేకుండా చెపలు, రొయ్యల చెరువులు తవ్వకూడదని, కానీ తవ్విన వారిపై చట్ట ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఏద్దేవా చేశారు. ప్రభుత్వ విధులను దుర్వినియోగం చేస్తున్న దెందులూరు తహశీల్దార్, ఎస్ఐ, సిఐలపై ఉన్నతస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ స్పందించి స్థానిక అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక భూస్వాములు ఉషా బాలకృష్ణారావు, గుడిపాటి సురేష్ అడుగులకు మడుగులు ఒత్తుతూ పేదలకు దళితులకు తహశీల్దార్, ఎస్ఐ అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. వీరు స్థానిక భూస్వాముల మాటలు విని పేదలు, దళితుల పట్ల వివక్ష చూపుతున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. దళితులపై పోలీసులను ఎందుకు ప్రయోగిస్తున్నారని మండిపడ్డారు. దెందులూరు ఎస్ఐ ఆటో రవాణా కార్మికుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ ఫోన్ చేసి బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సిహెచ్.జాన్‌రాజ్, నాగేంద్ర, పవన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత

వచ్చే ఎన్నికల్లో వైసిపిదే విజయం

హోం మంత్రి తానేటి వనిత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి ఘన విజయం సాధిస్తుందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. స్థానిక స్త్రీ శిశుసంక్షేమ శాఖ రీజనల్ డైరక్టర్ వందనపు సాయిబాల పద్మ నివాసానికి శనివారం తేనీటి విందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగిన లోకేష్‌యాత్ర, మెనిఫెస్టో, అజెండా కూడా లేని జనసేన పవన్ కల్యాణ్ ఎన్నికల గుర్తు కూడా లేని వాళ్ల కోసం వైసిపి భయపడాల్సిన అవసరం లేదని ధీమా వ్యక్తం చేశారు. 151 స్థానాల్లో సీట్లు సాధించి అధికారంలో ఉన్న వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో కూడా విజయం సాధించి ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమన్నారు. టిడిపి, జనసేన నాయకులు చేసే అసత్య ప్రచారానికి భయపడాల్సిన అవసరం వైసిపికి లేదన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్ సింగిల్‌గా పోటీ చేసి మళ్లీ ముఖ్యమంత్రిగా పరిపాలన చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

పేదల పక్షమా.. పెద్దల పక్షమా..!

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జగనన్న ఇళ్ల నిర్మాణం పేరిట పేదలకు పెద్దసంఖ్యలో ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇది కచ్చితంగా స్వాగతించాల్సిన అంశం. అదే సమయంలో ఆయా కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరించడంతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. ఇదే జరిగితే ప్రభుత్వం పదేపదే చెబుతున్నట్లు పేదల కోసం ఇళ్లే కాదు ఊళ్లకు ఊళ్లే నిర్మించినట్లు. ఇది కచ్చితంగా పేదల అభ్యున్నతికి పాటుపడే ప్రభుత్వంగా పేరొందుతుందనడంలో సందేహం లేదు. అయితే ఇళ్ల స్థలాలకు సేకరించిన భూమికి సంబంధించిన రైతుల ఆందోళన సర్వత్రా చర్చనీయాంశమైంది. దీనికి పశ్చిమగోదావరి జిల్లాలో మండల కేంద్రమైన పాలకోడేరు, ఏలూరు జిల్లాలో జంగారెడ్డిగూడెం మండలంలో లక్కవరం గ్రామంలో ఇటీవల భూ నిర్వాసితులైన పేద రైతుల ఆందోళనలే నిదర్శనం. ప్రభుత్వం జగనన్న ఇళ్ల కాలనీలకు భూమి రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసినట్లు పెద్దఎత్తున ప్రచారం చేసుకుంటుంది. దీనిలో వాస్తవం లేకపోలేదు. అయితే చాలా కాలం క్రితం వివిధ రూపాల్లో పేదలు ప్రభుత్వం నుంచి సాగు చేసుకుంటున్న భూములు వారి వారసులు అనుభవిస్తున్న సంగతి తెలిసిందే. అదే సమయంలో పట్టాలు పొందినవారిని మభ్యపెట్టి, తరిమికొట్టి పెద్దలు ఆక్రమించిన ఘటనలకు ఏలూరు జిల్లా దెందులూరు మండలం దోసపాడు భూ పోరాటమే ప్రత్యేక్ష నిదర్శనం. అలా ప్రభుత్వ భూములు అక్రమంగా అనుభవిస్తున్న పెద్దల నుంచి భూములు స్వాధీనం చేసుకుని పేదలకు అప్పగిస్తే అభ్యంతరాలేమీ ఉండవు. కాని పేదల అనుభవంలో ఉన్న భూములను లే అవుట్లుగా గుర్తించి తొలుత పరిహారం ఇస్తామని నమ్మించి భూములు అప్పగించాక అవి ప్రభుత్వ భూములైనందున పరిహారం ఇచ్చేది లేదనడం అత్యంత దారుణం. ఒకవిధంగా చెప్పాలంటే పేదల వద్ద భూములు లాక్కుని పేదలకే పంచడం ప్రభుత్వ అసమర్థతకు, వైఫల్యానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఒకవేళ అనివార్యంగా పేదల అనుభవంలోని భూములే లే అవుట్లుగా మార్చాల్సి వస్తే కచ్చితంగా మార్కెట్ రేటు ప్రకారం పరిహారం ఇవ్వడం.. లేదా ఆ భూములకు ప్రత్యామ్నాయంగా మరో భూమి చూపి సాగుకు కొంత ఆర్థిక సాయం అందించడం ప్రభుత్వ బాధ్యత. అయితే పాలకోడేరు, లక్కవరంలో అధికారులు, ప్రభుత్వ నిబంధనలకు పూర్తిగా నీళ్లొదిలి పేదల భూములు లాక్కొని పరిహారం సైతం ఇవ్వకుండా ముఖం చాటేస్తున్నారు. ఫలితంగా పాలకోడేరులో ఇప్పటికే భూ నిర్వాసితులైన ఓ పేదరైతు మనోవేదనతో ప్రాణాలొదలగా మరో పేద రైతు కుటుంబం తీవ్ర అనారోగ్యంపాలైంది. లక్కవరంలోనూ ఇదే తరహా పరిస్థితి నెలకొంది. దీనిపై ఇప్పటికే సిపిఎం ఆధ్వర్యాన పేదలు వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించారు. దీనికి అఖిలపక్షం, ప్రజాసంఘాలు మద్దతు తెలిపి ప్రత్యక్షంగా పాల్గొన్నాయి. ఇంత పెద్దఎత్తున ఆందోళనలు జరుగుతున్నా జిల్లా అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాకేంద్రం భీమవరానికి కూతవేటు దూరంలో పాలకోడేరులో పేదల ఆందోళన జిల్లా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు కనిపించడం లేదా అని పలువురు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. లక్కవరంలో పేదలు బలవన్మరణానికి సైతం సిద్ధపడడం ఆందోళనకరం. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి భూ నిర్వాసితులైన పేద రైతు కుటుంబాలకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి. లేనిపక్షంలో వైసిపి ప్రభుత్వ పెద్దలు పదేపదే తమది పేదల ప్రభుత్వమని, రైతుల ప్రభుత్వమని చెబుతున్నవన్నీ వట్టి మాటలేనని, పెద్దల పక్ష ప్రభుత్వమని జనం భావిస్తారనడంలో అతిశయోక్తి లేదు.

విఎస్ఎస్‌వి.ప్రసాద్

జిల్లా అగ్నిమాపక శాఖాధికారిగా రత్నబాబు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

విపత్తుల నిర్వహణ శాఖ అగ్నిమాపక శాఖల పరితీరును జిల్లాలో మరింత మెరుగుపరిచే విధంగా కృషి చేస్తానని అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి చిక్కాల రత్నబాబు అన్నారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారిగా చిక్కాల రత్నబాబు శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా అగ్నిమాపక అధికారిగా పనిచేస్తున్న రత్నబాబు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన మాల్యాద్రి విజయవాడ సిటీ అగ్నిమాపక అధికారిగా నియమితులయ్యారు. రత్నబాబు గతంలో జిల్లా కలెక్టరేట్‌లోని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగంలో డిపిఎంగా పని చేశారు. అనంతరం బదిలీపై గుంటూరు వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా అగ్నిమాపక అధికారి రత్నబాబును ఎడిఎఫ్ ఒ రామ కృష్ణ, జిల్లాలోని వివిధ అగ్నిమాపక కార్యాలయాల అధికారులు అభినందించారు.


పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి వెంకటరెడ్డి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పోలవరం

మండలం కొత్త పట్టిసీమ పంచాయతీలో మురుగు తూము, బోది ప్రక్షాళన అభివృద్ధి పనులను శనివారం ప్రారంభయ్యాయని పంచాయతీ సర్పంచి మైగాపుల విజయదుర్గ అన్నారు. ఈ అభివృద్ధి పనులకు పోలవరం ఎంపిపి సుంకర వెంకట రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మైగాపుల విజయదుర్గ మాట్లాడుతూ ఈ అభివృద్ధి పనులకు మండల పరిషత్ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేసి పంచాయతీ సహాయ సహకారాలు అందిస్తున్న ఎంపిపి సుంకర వెంకట రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ బోది పూడికతీత వల్ల రానున్న వర్షాకాలంలో మురుగునీరు, వర్షపు నీరు గ్రామంలో నిల్వ ఉండకుండా బయటికి వెళ్లేందుకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, సర్పంచి మైగాపుల విజయదుర్గ, ఎంపిటిసి సభ్యులు వలవల వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు అడ్డగర్ల సాయిబాబా, ఉప సర్పంచ్ రంభ శ్రీనివాస్,పంచాయతీ కార్యదర్శి టి విజయకుమారి, వైసీపీ సీనియర్ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్,రొంగల సుబ్బారావు,వలవల బాలాజీ, పూడి వెంకట్రావు,గూడపాటి పుల్లారావు, రొంగల సూర్యరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీలకు సంబంధించి ప్రవేశాలకు ఈ నెల నాలుగో తేదీ నుంచి 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌జికెయుటి వైస్ ఛాన్సలర్ ఆచార్య కేసిరెడ్డి తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను జులై 13న ప్రకటిస్తారని తెలిపారు. జులై 21 నుంచి 25వ తేదీ వరకు నాలుగు క్యాంపస్‌లకు ఎంపికైన విద్యార్థుల సర్టిఫికెట్లను ఆయా క్యాంపస్‌లలో పరిశీలిస్తారు. ఆగస్టు మొదటి వారంలో క్లాసులు ప్రారంభిస్తారని ఆచార్య కేసిరెడ్డి తెలిపారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

అనూ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సౌజన్యంలో శనివారం ముదినేపల్లిలోని శ్రీకృష్ణ మెడికల్ స్టోర్స్ వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో వైద్యులు సుకీర్తి, రోహిణి, నాగరత్నం, అజిత్‌రాజు పాల్గొని సంతానం లేక ఇబ్బందులు పడుతున్న వారికి ఉచిత వైద్య పరీక్షలు, సలహాలు, బిపి, షుగర్, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ వైద్య శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు హనుమార పేర్నీడు తెలిపారు.

గ్రంథాలయంలో విద్యార్థులు

విద్యార్థులకు కేరమ్స్ పోటీలు

ప్రజాశక్తి - నిడమర్రు

స్థానిక నిడమర్రు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు కేరమ్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమము నిడమర్రు ఎంపిడిఒ సిబ్బంది చిలుకూరి రవి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయ పాలకులు బాలరాజు పర్యవేక్షించారు

ఆలయాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని అల్లూరులో శ్రీగంగాభవాని అమ్మవారి ఆలయ నిర్మాణ పనులకు ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణతో కలిసి ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థలదాత నీలిపల్లి సతీష్‌ను డిఎన్ఆర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సత్యనారాయణ, గ్రామ సర్పంచి శీలం రామకృష్ణ, ఎంపిటిసి సభ్యులు రెడ్డి సతీష్, ఈడేపల్లి సర్పంచి అబ్బిశెట్టి వెంకటేశ్వరరావు, నాయకులు బొర్రా శేషు, ఆలయ ఛైర్మన్ జి.సుధారాణి, బత్తుల నాని, కె.మైనర్‌బాబు, జి.శ్రీనివాసరావు, కె.విష్ణువర్ధన్, బి.రవికుమార్ పాల్గొన్నారు.

రమణక్కపేటలో తిరుపతయ్య వర్ధంతి

ప్రజాశక్తి - ముసునూరు

పేద, బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సు కోసం పనిచేసిన ప్రజల పక్ష నాయకుడు, కమ్యూనిస్టు నాయకుడు ఆముదాల తిరుపతయ్య అని సిపిఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు డి.హరనాథ్ అన్నారు. మండలంలోని రమణక్కపేట గ్రామంలో కమ్యూనిస్టు నాయకుడు ఆముదాల తిరుపతయ్య వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చలసాని వెంకటరామారావు మాట్లాడుతూ దళిత వర్గాల నుంచి వచ్చి వామపక్ష ఉద్యమంలో పనిచేసి ఎందరో పేదలకు మేలు చేసిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వేముల బక్కయ్య, సిపిఐ ఎంఎల్ ఏలూరు జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు, ఆముదాల తిరుపతయ్య, మేరీ రత్నావళి ఎడ్యుకేషన్‌ల్ ట్రస్టు వ్యవస్థాపకులు ఆముదాల కాంతారావు, కొత్తపల్లి మాజీ సర్పంచి బొకినాల కాంతకుమారి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

క్రమశిక్షణ, విద్యలో మేటి క్రాంతి హై స్కూల్


2005లో కృష్ణకు మెమొంటో అందిస్తున్న అప్పటి కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి (ఫైల్)

ప్రజాశక్తి - కలిదిండి

శిక్షణలో క్రమశిక్షణలో క్రాంతి హై స్కూల్ ముందుంటుందని కరెస్పాండెంట్ చన్నంశెట్టి కృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ కోరుకొల్లు గ్రామం మధ్యలో క్రాంతి హై స్కూల్ నెలకొల్పినట్లు చెప్పారు. 36 వసంతాలు పూర్తి చేసుకుని మండలంలో అగ్రగామి సంస్థగా క్రాంతి హై స్కూల్ నిలిచిందన్నారు. గ్రామీణ ప్రాంతంలో కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తూ అందరికీ అందుబాటు ఫీజులతో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. విశాలమైన తరగతి గదులతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన చేస్తున్నామన్నారు. ఆటలు, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కంప్యూటర్ తరగతుల నిర్వహణతో పాటు అన్ని తరగతులకు డిజిటల్ క్లాసు సౌకర్యం ఏర్పాటు చే శామన్నారు. స మీప గ్రామాల వి ద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పి ంచామన్నారు. ప్రిన్సిపల్ చన్నంశెట్టి అజేష్‌బాబు ఆధ్వర్యంలో తమ ఉపాధ్యాయ సిబ్బందితో విద్యార్థుల విద్యాభివృద్ధికి నిరంతరం పర్య వేక్షించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం నాడు ఉత్తమ ఉపాధ్యాయునిగా పలుమార్లు ప్రముఖులతో సన్మానం పొందినట్లు తెలిపారు. ఐదుగురు కలెక్టర్లు, డిఇఒల ద్వారా పలు ప్రశంసాపత్రాలు పొందినట్లు చెప్పారు. పేద విద్యార్థులకు ఫీజులో రాయితీ ఇస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. క్రాంతి హైస్కూల్ లో విద్యార్థులను చేర్చి, వారి బంగారు భవితకు బాటలు వేయాలని కరస్పాండెంట్ చెన్నంశెట్టి కృష్ణ కోరారు.

కృష్ణను సత్కరిస్తున్న ఎంఎల్‌సి లక్ష్మణరావవు (ఫైల్)

ప్రిన్సిపల్ అజేష్‌బాబు


కరస్పాండెట్ కృష్ణ

హరికృష్ణను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - దెందులూరు

విద్యార్థులు బాగా చదివి అభివృద్ధిలోకి రావాలని, విద్యావంతుడైన గొరిపర్తి హరికృష్ణను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పలువురు అన్నారు. ఉపాధ్యాయ నాయకులు, కీర్తిశేషులు గొరిపర్తి హరికృష్ణ సంస్మరణ సభ దెందులూరు మండలంలోని కొవ్వలి గ్రామంలో శ్రీ భక్తాంజనేయ ఆలయ ప్రాంగణంలో అమ్మ సోషల్ థాట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యాయవాది శ్రీ కట్టా సత్యనారాయణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దెందులూరు మండల విద్యాశాఖాధికారి చల్లగొళ్ల బుధవాస్ చేతులమీదుగా ఎస్ఎస్‌సి పరీక్షల్లో మొదటి ర్యాంకు, రెండో ర్యాంకు, మూడో ర్యాంకు సాధించిన గొరిపర్తి శ్రీదేవి, కాపుదాసి ప్రదీప్, పిల్లి కిరణ్మయిశ్రీలకు ప్రతిభా పురస్కారం అవార్డులు, నగదు బహుమతులు గొరిపర్తి రామకృష్ణ ఆర్థిక సాయంతో అందించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కొవ్వలి జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్ఎల్ఎన్‌వి.శర్మ చేతుల మీదుగా వృద్ధులకు బియ్యం పంపిణీ చేసి ఆర్థిఖ సాయం అందించారు. ఈ కార్యక్రమానికి యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ షేక్ ముస్తాఫ్ అలీ, యుటిఎఫ్ దెందులూరు మండల జనరల్ సెక్రటరీ తొంట శ్రీనివాస్, గ్రామ ఉప సర్పంచి గొరిపర్తి శివకొండ, ఎంపిటిసి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వక్తలు

జ్వరాల పట్ల అప్రమత్తత అవసరం

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మలేరియా జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక ఏలూరు రూరల్ మండలం ప్రత్తికోలంక గ్రామంలో మలేరియా నివారణ మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బందితో కలిసి ప్రజలకు మలేరియా జ్వరాల పట్ల అవగాహన కల్పించారు. తీవ్రమైన జ్వరం, చలి, వణుకు, చెమటలు పట్టడం మొదలగు లక్షణాలు ఉంటే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. మలేరియా కారక దోమ మన గృహాలు, గృహ పరిసరాల్లో ఉండే మంచినీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయని, కాబట్టి వారానికి ఒకసారి మంచినీటి నిల్వ ప్రాంతాలైన తొట్లు శుభ్రపరచుకొని మూతలు పెట్టుకోవాలన్నారు. పల్లపు ప్రాంతాలను మట్టితో పూడ్చాలని, జ్వరాల నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలని, దోమల పెరుగుదల కాకుండా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. దోమకాటు నుంచి మనల్ని మనం సంరక్షించుకోవాలన్నారు. ఎవరైనా జ్వరంతో బాధపడుతుంటే స్థానిక ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలను సంప్రదించాలని, మలేరియా పరీక్షలు ఉచితమని, మందులు కూడా ఉచితంగా ఇస్తామని తెలిపారు. మలేరియా జ్వరాన్ని అశ్రద్ధ చేయొద్దన్నారు. మెదడుకు చేరి ప్రాణాపాయ స్థితికి వెళ్తారన్నారు. దోమల నిర్మూలన మన ధ్యేయం కావాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మలేరియా జ్వరాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శేషావతారం, ఎఎన్ఎం మహాలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ మురళి, శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

కౌలు రైతులకు ఎటువంటి సంక్షేమ పథకాలు అందడంలేదని, వారి సమస్యలు పరిష్కరించాలని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య అన్నారు. మండలంలోని మల్లాయగూడెం గ్రామంలో కౌలు రైతు సంఘం జిల్లా ప్రథమ మహాసభ శనివారం నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కెవివి.ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా పి.జమలయ్య మాట్లాడుతూ కౌలు రైతులు కష్టపడితే సంక్షేమ పథకాలు రైతులకు అందుతున్నాయన్నారు. దీనివల్ల చాలామంది కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దాదాపుగా రోజుకు 28 మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి.ప్రసాద్ మాట్లాడుతూ ప్రధాని మోడీ రైతులను మోసగిస్తున్నాడన్నారు. అందరం ఐక్యంగా ఉండి కౌలు రైతులకు సంక్షేమ పథకాలు వచ్చేలా పోరాడాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం కౌలు రైతుల పరిరక్షణ కోసం కౌలు రైతులంతా పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామని చెప్పి అధికారంలో కూర్చున్న మోడీ వాటిని అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. ఈ మహాసభకు దొంత కృష్ణ, మోరంపూడి శ్రీను, చలసాని నరేంద్ర అధ్యక్ష వహించారు. తొలుత కౌలు రైతు సంఘం జెండాను కౌలు రైతు సంఘం నాయకులు తక్కెలపాటి ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ మహాసభలో రైతు సంఘం నాయకులు లక్ష్మణరావు, ఎస్‌కె.కాలేశా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బత్తుల వెంకటేశ్వరరావు, పామాయిల్ రైతు సంఘం నాయకులు పుల్లారి సోమశేఖర్, సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, ఎఐటియుసి ఏరియా అధ్యక్షులు తుర్లపాటి బాబు పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు అభినందనీయం : ఎంఎల్ఎ బాలరాజు

ప్రజాశక్తి - కుక్కునూరు

వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అమలు చేయడంలో వాలంటీర్ల సేవలు అభినందనీయమని ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికే చెందుతుందన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంఎల్ఎ బాలరాజు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధులగా ఉంటూ అర్హత గల ప్రతి పేద కుటుంబానికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న వాలంటీర్ల సేవలను అభినందించారు. మండలంలోని 181మంది వాలంటీర్లలో ఉత్తమ సేవలందించిన వారిని సన్మానించి అవార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రావు మీనా, జెడ్‌పిటిసి సభ్యులు కె.నాగేశ్వరరావు, ఎంపిపి చేబ్రోలు గీతావాణి, వైస్ ఎంపిపి తాండ్ర రాజేష్, జి.రామచంద్రం, వైసిపి మండల కన్వీనర్ కె.నరసింహరాజు పాల్గొన్నారు.


వాలంటీర్లను సన్మానిస్తున్న ఎంఎల్ఎ, ప్రజాప్రతినిధులు

రైలు ప్రమాదానికి కేంద్రమే బాధ్యత వహించాలి

ప్రయివేటీకరణే ప్రమాదానికి ప్రధాన కారణం - ఐఎఫ్‌టియు ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు

ఒడిశాలో కోరమాండల్, యశ్వంతపూర్ రైళ్ల ప్రమాదానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, రైల్వే ప్రయివేటీకరణే ప్రమాదాలకు ప్రధాన కారణమని, మరణించిన వారికి రూ.50 లక్షలు, క్షతగాత్రులకు రూ.25 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో ఏలూరు వైఎంహెచ్ఎ హాలు సెంటర్‌లో శనివారం ధర్నా నిర్వహించారు. రైల్వే ప్రమాదానికి బాధ్యత వహించి రైల్వే శాఖ మంత్రి రాజీనామా చేయాలని, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపించాలని, రైల్వే గ్యాంగ్ మెన్‌ల సంఖ్యను పెంచాలని, ప్రమాదాలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ గత రాత్రి రైల్వే ప్రమాదంలో మరణించిన వారికి సంతాపం తెలిపారు. క్షతగాత్రులందరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్రమాదాలకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించి బాధితులందరినీ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైల్వేలో రోజురోజుకీ ప్రయివేటీకరణ విధానాలను కేంద్ర ప్రభుత్వం తీవ్రతరం చేసిందని, ప్రయివేట్ కాంట్రాక్టు వ్యవస్థ లాభార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తూ, ప్రజల యోగాక్షేమాలను, భద్రతను, రక్షణను పట్టించుకోవటం లేదని, ఆ కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని వారు విమర్శించారు. కిందిస్థాయి గ్యాంగ్ మెన్ వంటి ఉద్యోగుల సంఖ్యను పెంచకుండా ఖాళీలను భర్తీ చేయకుండా కార్మికులపై పని భారం పెంచారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రయివేటీకరణ విధానాల వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఇన్సూరెన్స్, పోస్టల్, టెలికాం, బిఎస్ఎన్ఎల్, విశాఖ ఉక్కు తదితర రంగాల ప్రయివేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. ఈ రైల్వే ప్రమాదంపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మరణించిన వారికి రూ50 లక్షలు, క్షతగాత్రులకు రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలని, అందరికీ మెరుగైన వైద్య సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల నెరవేర్చకపోతే భవిష్యత్తులో ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నగర అధ్యక్షులు కాకర్ల అప్పారావు, డి.వీరినాయుడు, ఉపాధ్యక్షులు మంగం అప్పారావు, నగర నాయకులు బి.వీరభద్రం, రాచీటి జాన్, సాయి, అన్నవరం, రాజు, ఈశ్వరరావు పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కె.నాని, నగర అధ్యక్షులు ఎం.క్రాంతి పాల్గొన్నారు.

'జనసేనంటే వైసిపికి భయం'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రాష్ట్ర హోం శాఖా మంత్రి తానేటి వనిత మేనిఫెస్టో లేని జనసేన అంటే భయపడటం లేదని చెప్తూ తన భయాన్ని బయటపెట్టారని జనసేన చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకా ఈశ్వరయ్య తెలిపారు. జనసేన పార్టీపై హోం మంత్రి తానేటి వనిత చేసిన వ్యాఖ్యలపై స్పందించిన మేకా ఈశ్వరయ్య మాట్లాడుతూ శుక్రవారం రాత్రి జరిగిన విలేకరుల సమావేశంలో హోం శాఖా మంత్రి తానేటి వనిత మాట్లాడిన మాటలను బట్టి ఆమె జనసేనను చూసి భయపడుతున్నట్లుగా తెలుస్తుందన్నారు. మేనిఫెస్టో లేకపోతేనే అంతభయం ఉంటే జనసేన మేనిఫెస్టో విడుదల చేస్తే తట్టుకోలేరన్నారు. జనసేన పార్టీ 2019 ఎన్నికల్లో మేనిఫెస్టో విడుదల చేసిందనే సంగతి కూడా తెలియని రాష్ట్ర హోం మంత్రి రాజకీయ అజ్ఞానంలో ఉన్నారన్నారు.

రైతుల అభ్యంతరాలు స్వీకరణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూసేకరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతుల నుంచి వినతులు, అభ్యంతరాలు శనివారం స్థానిక సచివాలయం-1లో భూసేకరణ కార్యాలయం సీనియర్ సహాయకులు షేక్ మహమ్మద్ షరీఫ్ స్వీకరించారు. భూములు కోల్పోతున్న రైతులకు గ్రామసభ నిర్వహించి మొదటి నోటీసుపై అభ్యంతరాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ వెడల్పు పెంచుతున్న నేపథ్యంలో రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ వి.గోపి, పలువురు రైతులు పాల్గొన్నారు.

రైతుల నుంచి అభ్యంతరాలు, వినతులు స్వీకరిస్తున్న షరీఫ్

ఎస్‌బిఐ ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు

వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని ఏలూరు శ్రీరామ్ నగర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి ఉద్యోగులు వారి ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి వద్ద శనివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మజ్జిగను ప్రజలకు బ్రాంచి మేనేజర్ వైవి.సత్యనారాయణ, దిలీప్ అందించారు.

బాలికా సంరక్షణకు 'చిన్నారి భవిత'

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని యాదవ పేట, ముస్లిం పేట, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద శనివారం చిన్నారి భవిత కార్యక్రమాన్ని నిర్వహించారు. సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో చిన్నారి పాపకు బేబీ కిట్ బహుకరించి సుకన్య సమృద్ధి యోజన పథకం గురించి వివరించి పొదుపు చేయడంపై ప్రోత్సహించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అన్నమ్మ మాట్లాడుతూ బాల్యవివాహాలను నిషేధించి బాలిక విద్యకై ముందడుగు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

KANAKADURGA
FINAN CE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : ఏలూరురోడ్డు, లక్ష్మిథియేటర్ ఎదురు, జంగారెడ్డి గూడెం.
-1st ఫ్లోర్, సుబ్బారావుపేట,కమల హాస్పిటల్స్ ఎదురు, తాడేపల్లిగూడెం
-1st ఫ్లోర్, వెంకన్నప్లాజా, కప్పల వెంకన్న సెంటర్, వేల్పూరు రోడ్డు, తణుకు.
-1st ఫ్లోర్, కన్నపురం రోడ్డు, వాసవి కన్యకా పరమేశ్వరి గుడి పక్కన, కొయ్యలగూడెం.
-1st ఫ్లోర్, జెడ్‌ల్యాబ్స్ ఎదురు, ఆర్ఆర్‌పేట, ఏలూరు.
-1st ఫ్లోర్, బస్టాండ్ ఎదురు, దేవరపల్లి
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 26.06.2023 ఉ. 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 1039.10 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 8008812798

సర్టిఫికెట్లు పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం రూరల్ మండలం నరసింహపురం గ్రామకాపురస్తులు ఉద్దరాజు విజయ రాఘవేంద్ర వర్మ చెందిన **రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆయుర్వేద బోర్డ్ రి.నెం.175/NY/2017** అవి తీసుకుని నరసింహాపురం గ్రామంలోని శ్రీ రాఘవేంద్ర కాలేజీలో గల జిరాక్స్ మిషన్ వద్ద ది.30-04-2023వ తేదీన జిరాక్స్ తీయించుకొని నరసింహ పురములోని మా ఇంటికి తిరిగి వెళ్ళుచుండగా మార్గమధ్యంలో పడిపోయినవి. మార్గమధ్యములోనూ పరిసర ప్రాంతంలోనూ వెతకగా దొరకలేదు. పైన తెలిపిన నా సర్టిఫికెట్ దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌నకు తెలియపరచవలసిందిగా కోరుచున్నాను.

ఉద్దరాజు విజయ రాఘవేంద్ర వర్మ
నరసింహపురం, భీమవరం మండలం.
సెల్: 91000 7778

పబ్లిక్ నోటీసు

మా క్లయింట్లు అయిన ప్రస్తుతం ఏలూరు జిల్లా, ఏలూరు, తూర్పు వీధి, కాపురస్తులు మరియు ప॥గో॥జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, పెద తాడేపల్లి గ్రామ నివాసస్థులు అయిన **ఉయ్యూరి శ్రీనివాసరావు కుమార్తె ఉయ్యూరి లాస్యశ్రీ మరియు కుమారుడు ఉయ్యూరి చరణ్ శివసాయి విజయ్ మైనర్లు అయినందున సహజ సంరక్షకురాలు మరియు తల్లి ఉయ్యూరి విజయ పెద్దేశ్వరి** ఇచ్చిన సంజాయిషీపై ఈ పబ్లిక్ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా.., మా క్లయింట్లు తండ్రి గారైన శ్రీనివాసరావు గార్కి పెద తాడేపల్లి గ్రామంలో రి.స.నెం. 826, ఇంటి నెం. 6-8 (సమీపం) చ॥గ॥ 193.1/2ల ఇంటి స్థలములో 3 అంతస్తుల భవనం, సదరు గ్రామంలో రి.స.నెం. 579/2లో పురా య. 4-58ట్లులో య.0-91ట్లులో ఉత్తరం వైపు య. 0-70ట్లు భూమిని ఇల్ల స్థలము విభజింపగా ప్లాటు నెం.6లో గల చ॥గ॥ 317.1/2ల స్థలము య. 1-02ట్లు, రి.స.నెం. 13 పురా య.7-27ట్లు, రి.స.నెం.14 పురా య.14-9ట్లులో తూర్పు వైపు య.2-90ట్లు, రి.స.నెం. 11/2లో పడమర వైపు పురా య.3-07ట్లులో య.2-07ట్లు, రి.స.నెం. 9/1 పురా య.3-18ట్లులో య.1-00ట్లు మొత్తం కలిపి య.14-26ట్లు కొత్త రి.స.నెం. 27/1, య.0-34ట్లు, రి.స.నెం. 28/4బి, య.0-05ట్లు, రి.స.నెం. 28/5, య.0-11ట్లులో య.0-50ట్లు సదరు భూమికి 1/48వ వంతు బోరు వెల్ య.0-02ట్లు భూమి హక్కు మరియు తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ, కడకట్ల గ్రామ రెవెన్యూ గ్రామము తాలూక రి.స.నెం. 17/3సి, దక్షిణం వైపు య.0-50ట్లు ఆకుమళ్ళ చెరువు భూమి మరియు రి.స.నెం.17/3సి, య.0-02ట్లులో బోరు భూమిలో గల 1/48 వంతు హక్కు గల భూములు మాక్లయింట్లుకు మరియు మా క్లయింట్ల గారి తండ్రి గారైన ఉయ్యూరి శ్రీనివాసరావుకు జాయింటు కుటుంబమునకు సంబంధించిన ఆస్తులైయుండి, జాయింటుగా అనుభవించుచున్నాము. సదరు స్థిరాస్థులను "3" వాటాలుగా పంపకం చేయమని మా క్లయింట్లు తండ్రి గారైన ఉయ్యూరి శ్రీనివాసరావుకు ది.01-05-2023వ తేదీన ప్లీడరు గారి ద్వారా నోటీసులు పంపించియున్నారు. సదరు నోటీసు అందిన దరిమిలా మా క్లయింట్లు తండ్రి గారైన శ్రీనివాసరావు గారు చట్టరీత్యా చెల్లని దస్తావేజులు వారి యొక్క దగ్గర బంధువులు, అనుయాయులు, మరియు స్నేహితుల పేరున దస్తావేజులు సృష్టించుటకు ప్రయత్నించుచున్నారని మా క్లయింట్లుకు తెలియవచ్చినది.

సదరు స్థిరాస్తులు మా క్లయింట్లు మరియు సదరు శ్రీనివాసరావు జాయింటు అనుభవంలో ఉండి నా క్లయింట్లు తండ్రి గార్కి ఎటువంటి దస్తావేజుల ద్వారా హక్కులు బదిలీ చేయు హక్కు లేదు. సదరు స్థిరాస్థులు ఏవిధమైన దస్తావేజులు సృష్టించిననూ సదరు స్థిరాస్తులపై సృష్టించబోవు దస్తావేజులకు ఎటువంటి చట్టబద్ధత లేదని మరియు మా క్లయింట్లు పై ఎటువంటి బద్ధింపు లేదని మరియు సదరు దస్తావేజులు మా క్లయింట్లు తండ్రి ద్వారా పొందువార్లకు ఏవిధమైన హక్కులు కలగవని, అయినప్పటికీ దస్తావేజులు పొందిన యెడల వారు నష్టపోవుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

తాడేపల్లిగూడెం, ది.03-06-2023.

ముద్దాని శ్రీనివాసరావు
ఈడా ఫరోత్ బాబు
న్యాయవాదులు, తాడేపల్లిగూడెం.
సెల్: 94418 80541, 79892 78168